కెమేరామెన్ నిశబ్దంగా వాళ్ళ సంభాషణ వింటూ వున్నాడు గొంతు సర్దుకుని చెప్పాడు.

“మనందరికీ సంబంధించిన ఒక భయంకర సంఘటన ఇందాకే నా దృష్టిలోకి వచ్చింది. గత పదహారు రోజులుగా చిత్రీకరించిన ఫిలిం పూరిగా వృధా అయింది. మద్రాస్‌లోని లేబరేటరీనుంచి టెలిగ్రాం వచ్చింది....కెమేరా షట్టర్ తెరవడం మరిచారు దాన్ని సప్లయి చేసిన ఔట్‌డోర్ యూనిట్ సప్లయిర్”

నిర్మాత క్షణకాలం మౌనములో వుండిపోయాడు తరువాత కళ్ళు మూసుకొని బీరుబాటిల్ ఎత్తి గటగట తాగేశాడు.

## అద్భుతమైన చీర

విద్యావతిని సాదరంగా ఆహ్వానించి పలకరించాడు బట్టలదుకాణం యజమాని.

“కులాసానా అమ్మా? మామీద సీతకన్ను వేసారు బొత్తిగా”

“కులాసా. ఎలావుంది మీ వ్యాపారం? కొత్తచీరలేమయినా వచ్చాయా?” చిరునవ్వుతో అన్నది, విద్యావతి ఎదురుగా కౌంటర్ మీద వున్న ఒక సినిమాపత్రికని అప్రయత్నంగా అందుకుంటూ.

బట్టలదుకాణం యజమాని కుర్రాడ్ని కోకోకోలా పట్టుకురమ్మని పంపించాడు. విద్యావతికి గాలి చక్కగా తగిలేలా ఫేన్‌ని ఎడ్జెస్టు చేశాడు.

"ఫారిన్‌నైలాక్స్ కొత్తవేమయినా వచ్చాయా?" అడిగింది విద్యావతి.

"ఉన్నాయి మా దగ్గర అద్భుతమయిన చీరవుంది. షిఫాన్ అనుకోండి. అది మీలాంటి రెగ్యులర్ కష్టమర్స్‌కే అమ్మాలని దాచి వుంచాను"

"షిఫాలో అద్భుతమయిన చీరలుంటాయని నాకు తెలియదే" అన్నది విద్యావతి పకపకా నవ్వి.

"ఉండవు కాని మాదగ్గరదిమాత్రం నిజంగా అద్భుతమయినదే. ఆ సినిమా పుస్తకం ఇటివ్వండి చెప్తాను" అని అయన ఆ సినిమా మేగ్జేన్ అందుకుని గబగబా పేజీలు తిప్పి, ఓ హీరోయిన్ బొమ్మని చూపించాడు విద్యావతికి. రంగులలోవున్న ఆ బొమ్మలో హీరోయిన్ కట్టుకున్న చీర నెమలికంఠం రంగుచీర అందంగా వుంది.

"అచ్చం ఇలాంటి చీరే మా దగ్గరుంది. నిజానికి ఈ చీరే మా దగ్గరుంది.

"ఈచీరే? ఆశ్చర్యంగా అడిగింది.

"ఔను. ఇదే ఇంకా ఈ సినిమా విడుదలవలేదు"

అద్దాల షోకేస్‌లోంచి ఓ చీరతీసి కౌంటర్‌మీద పరిచాడు విద్యావతి ఆ చీరను బొమ్మలోవున్న చీరతో పోల్చిచూసింది. రెండూ ఒకటేరంగు డిజయినులో వున్నాయి.

"ఈ హీరోయిన్ నా అభిమాన తార. ఈ చీర ఖరీదెంత?" అడిగింది ఆత్రంగా.

ధర చెప్పాడు ఆయన కుర్రాడు అందించిన కోకోకోలా తాగాక అన్నది విద్యావతి హేండ్‌బాగ్ తెరుస్తూ....

"పేక్ చేయించండి"

నెలతరువాత ఆ సినిమా విడుదలయింది. విద్యావతి ముందరే భర్తతో చెప్పి ఆ సినిమాకి మొదటిఆటకి రెండు టికెట్స్ రిజర్వు చేయించింది. అ నెమలి కంఠంరంగు షిఫాన్‌చీర కట్టుకునే వెళ్ళింది భర్తతో హుందాగా. సినిమా నడుసునంతసేపూ తను కట్టుకున్న తరహాచీర హీరోయిన్ ఏ ఏ దృశ్యాలలో కట్టుకుందో గమనించి భర్తకు చెప్పసాగింది విద్యావతి. ప్రక్కవాళ్ళుకూడా ఆసక్తితో వింటున్నారు.

దృశ్యం మారింది రేప్‌సీను అది. విలన్ హీరోయిన్‌ని రేప్ చేస్తున్న దృశ్యం అది.

తెరమీద "వద్దు నీచుడా, నన్ను వదిలిపెట్టు" అన్న హీరోయిన్ కేకలతోపాటు తెరముందు నేల తరగతి ప్రేక్షకుల ఈలలు, అరుపులు చప్పట్లతో కొద్దినిమిషాలు ఆ సినిమాహాలు ప్రతిధ్వనించింది

అకస్మాత్తుగా ముందు మూడవ వరుసలోంచి ఆ బట్టలదుకాణం యజమాని కంఠం ఆ దంపతులిద్దరికీ వినిపించింది. ఎవరితోనో చెబుతున్నాడు ఆయన.

"మనవూళ్ళోనే జరిగింది ఈ దృశ్యం షూటింగు. ఇప్పుడు హీరోయిన్ కట్టుకున్న లాంటిచీర మద్రాస్‌లో మర్చిపోయారట వచ్చేటప్పుడు. ప్రొడక్షను మేనేజర్ మా షాపులోంచి ఇప్పుడు హీరోయిను కట్టుకున్న చీరని అద్దెకు తీసుకెళ్ళాడు. తర్వాత ఓ కాతాదారుకి ఆ చీరను అమ్మేశామనుకోండి."

తెరమీద ఆ హీరోయిన్ వంటిమీద చీర అప్పటికే ముప్పాతిక భాగం ఊడిపోయింది.